క్లుప్తంగా

కేశవస్వామికి తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో అడవికొలను శ్రీ కేశవస్వామి

నిడమర్రు: తొలి ఏకాదశి సందర్భంగా అడవికొలను శ్రీకేశవ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు చక్రవర్తుల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువ జామునుంచే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వృద్ధులకు పళ్లు, రొట్టెల పంపిణీ



వృద్ధులకు పళ్లు, రొట్టెలను పంపిణీ చేసిన దృశ్యం

భీమడోలు: వృద్ధుల సేవ దేవుని సేవతో సమానమని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ యేసురాజ్యం లత అన్నారు. ఆదివారం కరుణ సందర్శన కార్యక్రమంలో భాగంగా సూరప్పగూడెంలో స్థానిక సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వృద్ధులకు పళ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె



కనకదుర్గమ్మకు సారెను తీసుకెళుతున్న మహిళలు

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు చెక్ పోస్ట్ వద్ద ఉన్న కనకదుర్గమ్మకు మండలంలోని రామదండు నాయకులు సుబ్బిశెట్టి నూకరాజు, సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం 170 కావేళ్లతో తొలి ఏకాదశి ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా గౌడ వీధిలో గంగానమ్మకు తొలి ఏకాదశి సందర్భంగా మహిళలు ఆషాఢ సారె సమర్పించారు.

కోటలమ్మకు ఆషాఢమాస పూజలు



కోటలమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలులో కొలువైన కోటలమ్మ ఆలయంలో ఆషాఢమాస పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత కోటలమ్మకు మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా వచ్చి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

వీఆర్వో మృతి



చంద్రశేఖర్, వీఆర్వో

గణపవరం: మండలంలోని కాశిపాడు వీఆర్వోగా పనిచేస్తున్న పల్లి చంద్రశేఖర్ (50) ఆదివారం గుండెపోటుతో మరణించారు. శనివారం సాయంత్రం ఆయన విధులు ముగించుకొని ఇంటికి రాగా, ఒంట్లో నలతగా ఉండటం, గుండెల్లో నొప్పిగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన రాజమండ్రిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి చికిత్స పొందిన తరువాత ఆదివారం ఉదయం ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో డిస్చార్జి చేశారు. ఇంటికి తీసుకొస్తుండగా ధవళేశ్వరం వచ్చే సరికి మళ్లీ గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈయన మృతదేహాన్ని స్వగ్రామం నిడమర్రు మండలం పెదనింద్రకొలను తీసుకొచ్చారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తహసీల్దార్ అప్పారావు, డీటీ రత్నం, ఆర్ఐ గోపికృష్ణ, మండల వీఆర్వో సంఘం అధ్యక్షుడు కేశవమూర్తి, పలువురు వీఆర్వోలు చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు. కాశిపాడు సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీటీసీ పద్మావతి రమేష్‌రాజు, తదితరులు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

భీమడోలు: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులో ఆదివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పి.మూర్తి, ప్రవీణ్‌కుమార్ పటేల్, మత్తి శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు.

క్రిమి సంహారకాల వాడకం.. ప్రాణాంతకం

- వాటి అవశేషాలతో అనారోగ్యం
- రైతులు జాగ్రత్తలు పాటించాలి
- దీర్ఘకాలికంగా పంటలపైనా ప్రభావం



పంటకు పురుగు మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పెదవేగి : క్రిమి సంహారక మందుల వాడకంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్య సమస్యల బారిన పడతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కో సారి మరణాలు కూడా సంభవిస్తాయని చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో పంటల్లో ఎరువులు, మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారులు, డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు పలు జాగ్రత్తలను వివరించారు.

రసాయనాలతో అనారోగ్య సమస్యలు

పంటలను ఆశించే చీడపీడల నివారణ కోసం రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తుంటారు. ఈ తరుణంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. పరోక్షంగా ఇతర ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. క్యాన్సర్, గుండె జబ్బులు, కళ్లు తిరగడం, వాంతులు, కాలేయం పెరుగుదల, నరాల బలహీనత వంటి వాటికి లోనయ్యే ప్రమాదముంది. పిచికారీ చేసే వ్యక్తులకే కాకుండా మందుల వాడకంతో వాటి అవశేషాలు పంటలపై చాలా కాలంగా ఉండి వాటిని వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి లోనవుతున్నారు.

సేంద్రియ సాగు విధానం మేలు

సేంద్రియ సాగు, విధానాన్ని అనుసరించడం వలన నేల ఆరోగ్యంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యకర పంట ఉత్పత్తులు పొందొచ్చు. పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయడం వలన పెట్టుబడి వ్యయం సగానికి పైగా తగ్గుతుంది. పశువుల వ్యర్థాలు, వేపాకు కషాయం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీకంపోస్టు వంటివి వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుంది. విచక్షణా రహితంగా పురుగు మందులు వినియోగించడం వలన కీటకాలు వ్యాధి నిరోధక శక్తిని పొందుతాయి. దీని వలన పంటకు మరింత నష్టం చేకూరుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. ముఖానికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి.
- పిచికారీ చేసే సమయంలో పొగ, నీరు తాగడం, భోజనం చేయడం వంటివి చేయకూడదు.
- పిచికారీ మందు కోసం వాడే స్ప్రేయర్లు కండీషన్‌లో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలి.
- పురుగు, తెగుళ్ల మందులను కలిపేటప్పుడు చేతులతో కాకుండా కర్రతో కలపాలి.
- ఆహార పదార్థాలతో పాటు కీటక నాశక మందులను రవాణా చేయరాదు.
- పురుగు మందుల డబ్బాలను పిల్లలకు అందకుండా వాటికి కేటాయించిన గదిలో భద్రపరిచి తాళం వేయాలి.
- పురుగు మందులు వినియోగించే ముందు వాటిపై వివరాలను బాగా పరిశీలించాలి. డబ్బాలపై రంగు ముద్రలను కూడా పరిశీలించాలి.
- గాలి వీచే దశలోనే మందు ద్రావణం పిచికారీ చేయాలి.
- నాజిల్స్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదకూడదు.
- ప్రమాదవశాత్తు మందు కళ్లలో పడితే వెంటనే మంచినీటితో శుభ్రం చేసుకోవాలి.
- కీటక నాశక మందుల డబ్బాలను ఖాళీ అయిన వెంటనే గొయ్యి తీసి అందులో పూడ్చిపెట్టాలి. వాటిని ఇతర అవసరాలకు వాడరాదు.
- పిచికారీ పూర్తైన వెంటనే స్నానం చేసి దుస్తులను శుభ్రపరచుకోవాలి.
- ప్రమాదవశాత్తు విష ప్రభావానికి గురైతే ప్రథమ చికిత్సఅందించి, డాక్టర్‌ను సంప్రదించాలి. పురుగు మందుల వివరాలను డాక్టర్‌కు తెలపాలి.
- పిచికారీ పూర్తైన అనంతరం స్ప్రేయర్ల ట్యాంక్ బయట, లోపల శుభ్రంగా కడిగి వాటి భాగాలకు ఇంజన్ ఆయిల్ పట్టించి జాగ్రత్త పరచాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పంటలకు కావాల్సినంత నీరు అందకపోతే చీడపీడలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. తొలి దశలోనే తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో పంటలు పూర్తిగా దెబ్బ తినే ప్రమాదముంది. దీనిపై రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి. – శ్రీనివాస్, ఏవో, పెదవేగి

వేదకుమారికి అబ్బయ్యచౌదరి అభినందన



వేదకుమారిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల నూతన కమిటీలు పార్టీ అభివృద్ధి బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం అబ్బయ్యచౌదరిని ఆయన కార్యాలయంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తొత్తడి వేదకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్యదర్శి నియామకపు వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైఎస్సార్‌సీపీ నాయకులు గోరిపర్తి శ్రీనివాసరావు, అక్కినేని శ్రీనివాసరావు, తొత్తడి కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

దెందులూరు: మండలంలోని జోగన్నపాలెం, అప్పారావుపాలెం,శ్రీరామవరం, కంఠమనేనివారి గూడెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



భీమడోలు: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు



దెందులూరు: బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

భీమడోలు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దేశ తొలి ఉప ప్రధాని, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. పోలసానిపల్లిలో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి సర్పంచ్ షేక్ రహీమాబేగం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, దేశ అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి అజరామరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాబూ జగ్జీవన్‌రామ్ యువసేన అధ్యక్షుడు భీమడోలు రామకృష్ణ, శ్యామ్‌రాజు, బొబ్బా బాలాజీ, మద్దు శ్రీను, దూడి రాజేష్, ఉండి పెద్దిరాజు, మెరుగు రాజేష్, యువకులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడు

దెందులూరు: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ నేటి యువతకు ఆదర్శనీయుడని గాలాయగూడెం సర్పంచ్ చలక వెంకట సుబ్బారావు అన్నారు. ఆదివారం గాలాయగూడెం పంచాయతీ నాగులదేవునిపాడు కమ్యూనిటీ హాల్ వద్ద డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్థంతి నిర్వహించారు. తొలత ఆయన చిత్రపటానికి వార్డు మెంబర్ కె.శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఏడుకొండలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశం ఆహార భద్రత కోసం ప్రణాళికాబద్ధంగా ముందు చూపుతో డాక్టర్ జగ్జీవన్‌రామ్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థను ఏర్పాటు చేశారన్నారు. చరిత్ర ఉన్నంత కాలం దేశం కోసం ఆయన చేసిన సేవలు కొనియాడతారన్నారు.

దాతల సేవలు అభినందనీయం



మానవత సంస్థకు ఫ్రీజర్‌ను అందజేస్తున్న దాతలు

భీమడోలు: సమసమాజ స్థాపనలో దాతల సేవలు అభినందనీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాంతి రథాల కమిటీ జిల్లా చైర్మన్ అప్పక రాంబాబు అన్నారు. భీమడోలు గ్రామానికి చెందిన అమరా తులసీదేవి, అమరా నాగేశ్వరరావు దంపతులు రూ.75 వేల విలువ గల నూతన ఫ్రీజర్‌ను ఆదివారం మానవత సంస్థకు బహూకరించారు. భీమడోలు మానవత శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా అప్పక రాంబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం అమరా నాగేశ్వరరావు, తులసీదేవి దంపతులకు మొమెంటో అందించి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భీమడోలు శాఖ అధ్యక్షుడు అల్లాడ ప్రసాద్, ప్రతినిధులు ఆర్డీఎం ప్రసాద్, పసుపులేటి సాంబశివరావు, గోనుగుంట రమణశంకర్, సత్యేంద్ర, అల్లూరి దుర్గబాబు, సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స కన్నా నివారణే మిన్న



పూళ్లలో కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్యాధికారిణి నాగజ్యోతి

భీమడోలు: చికిత్స కన్నా నివారణే మిన్న సూత్రాన్ని పాటిస్తూ పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవడం మేలని పూళ్ల పశు వైద్యాధికారిణి డాక్టర్ బి.నాగజ్యోతి అన్నారు. పూళ్ల, గుండుగొలను, భీమడోలు పశువైద్య ఆసుపత్రుల్లో ఆదివారం జూనోసిస్ డేను పురస్కరించుకొని పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పూళ్ల వెటర్నరీ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ ఉచిత శిబిరాన్ని సర్పంచ్ దాయం సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా పూళ్ల పంచాయతీ పరిధిలోని 43 పెంపుడు జంతువులకు వైద్యాధికారిణి నాగజ్యోతి టీకాలు వేసి యాజమానులకు పలు సూచనలందించారు. ప్రతి ఏటా జంతువులకు ప్రభుత్వం ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది దాయం ప్రసాద్, జంతు యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలి



ఆపస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం(ఆపస్) జిల్లా కార్యవర్గ సమావేశం పట్టణంలోని పార్కు రోడ్డులో గల సంఘ భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఇజి.సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఆప్షనల్ హాలిడే వల్ల సగం మంది ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు హాజరైతే విద్యార్థులకు పాఠాలు పూర్తి స్థాయిలో చెప్పడానికి అవకాశం ఉండదని, కావున ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా కాకుండా పాఠశాల మొత్తానికి సెలవు ఇవ్వాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నందు డాక్యుమెంటేషన్, ఫొటోలు అప్‌లోడ్ చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఉండాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. ఉపాధ్యాయులు ఉదయం 7 గంటల లోపే సెలవు అప్లై చేయమనడం సరికాదని, ఉదయం 9 గంటల వరకు సమయం ఉండాలన్నారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని పాఠశాల ముగిసిన తర్వాత కాకుండా పాఠశాల పని వేళల్లోనే ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డి నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి బీవీ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి జి.గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆనందరాజు మృతి



గణపవరం: గణపవరానికి చెందిన ప్రముఖ దాత, రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు వేగేశ్న ఏసుధాతరాజు పెద్ద కుమారుడు వేగేశ్న ఆనందరాజు ఆదివారం ఉదయం విశాఖపట్నంలో మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మరణం పట్ల వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నడింపల్లి సోమరాజు, వేగేశ్న సుబ్బరాజు, ప్రసాదరాజు, శ్రీనివాసరాజు, నడింపల్లి శ్రీరామ్, పుల్లంరాజు, కఠారి రంగరాజు తదితరులు సంతాపం తెలిపారు.

ఆలయ నిర్మాణంపై గ్రామ పెద్దల సమావేశం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామ ప్రజలు అత్యంత ఆత్రుతతో ఎదురుచూస్తున్న శ్రీ చింతాలమ్మ అమ్మవారి నిర్మాణానికి శ్రీకారం పలికారు. గ్రామ దేవత చింతాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం గ్రామ పెద్దలు సమావేశమై ఆలయ నిర్మాణంపై సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు. గ్రామ పురోహితులు బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ పర్యవేక్షణలో రాజకీయ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొని చర్చలు జరిపారు. ఆలయం వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు.

ఘనంగా ఏకాదశి పూజలు



సీతారామ స్వామి

భీమడోలు: తెలుగు వారి మొదటి పండుగ తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని శ్రీసీతారామస్వామి, శ్రీవేంకటేశ్వర స్వామి వార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆషాఢశుద్ధ ఏకాదశి మహా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గుండుగొలనులో అతిపురాతన దేవాలయం శ్రీసీతారామస్వామి వారి ఆలయంలో ఆలయ ఫౌండర్ కొండ గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజారి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషాలంకరణతో సుందరంగా ముస్తాబు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, తులసీదళార్చన, విశేషార్చనలు, తులసి పూజలు చేశారు. ఈ నెల 15వ తేదీ వరకు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని గంగరాజ్ కుమార్ తెలిపారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



గూటాలలో సమావేశమైన యూనియన్ సభ్యులు

పోలవరం రూరల్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. పోలవరం మండలం గూటాలలో అరుణోదయ కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ యూనియన్ సమావేశం అధ్యక్షుడు రమణోజు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ జనరల్ బాడీకి ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఈ నెల 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజా భూలోకరావు, ఎలుగంటి రాజు, పెంటపాటి శ్రీను, కాకి సూర్య ప్రకాశం పాల్గొన్నారు.

గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయించాలి

దెందులూరు: అన్ని గ్రామాల్లో రైతులు తమ గొర్రెలు మేకలకు ఉచిత నట్టల నివారణ మందులను వేయించుకోవాలని దెందులూరు మండల పశు వైద్యాధికారి డాక్టర్ హరి అన్నారు. ఆదివారం కొవ్వలి పశు వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ దెందులూరు మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో 27,426 గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు. మండలంలో పశు వైద్య శాఖ సిబ్బంది దాదాపు లక్ష్యాలకు అనుగుణంగా ఉచిత నట్టాల నివారణ మందులు అందించారన్నారు. రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉండేందుకు సహకరించాలని సూచించారు.

ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం చేయాలి

కంభం విజయరాజు పిలుపు



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పార్టీ పట్టణ అధ్యక్షుడిగా కర్పూరం గవరయ్య గుప్త (నాని) ప్రమాణస్వీకార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గవరయ్య గుప్తచే పట్టణ మాజీ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో విజయరాజు మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చకుండానే ప్రజల్లోకి వెళుతున్నారని. దీంతో వారిని నిలదీసే పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు మేలు చేశారన్నారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ నినాదంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

మరో ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథరావు మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ పదవులు అలంకారాలు కాదని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్‌లు, మండల కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర, ముప్పిడి శ్రీను, చింతా అనిల్‌కుమార్, షేక్ అక్బర్, చనమాల శ్రీనివాస్, వందనపు వెంకటేశ్వరరావు, బత్తిన చిన్న, జెట్టి ఆదిత్య, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ నూతన అధ్యక్షుడి కర్పూరం గవరయ్య గుప్త, కంభం విజయరాజులను నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.